క్లుప్తంగా

రసం పీల్చే పురుగుల నివారణకు సూచనలు

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో గురువారం డిజిటల్ సీఆర్పీ గౌతమ్ కుమార్ పెస్ట్ సర్వేలైన్స్‌లో వరిలో రసం పీల్చే పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు 5 కేజీల వేప పిండిని 200 లీటర్ల నీటిలో మూడు రోజులు నానబెట్టి పిచికారీ చేయాలని సూచించారు. ముందుగా ఎకరాకు పావుకేజీ పాల ఇంగువ నీటిలో కలుపుకుని ఈ రెండింటి మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయడం వల్ల రసం పీల్చే పురుగులతో పాటు వరిలో వచ్చే పొడ తెగులును కూడా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నాగ విజయ, రైతు నాగరాజు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



తోట్లవల్లూరు: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్షురాలిగా సీహెచ్ మైథిలి, ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయశ్రీ ఎన్నికయ్యారు. యూటీఎఫ్ మండల శాఖ సమావేశం గురువారం జరిగింది. నూతన కమిటీ గౌరవాధ్యక్షునిగా విష్ణువర్ధన్, సహాధ్యక్షులుగా అహ్మద్‌బాబు, హిమకుమారి, కోశాధికారిగా పమిడేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా అనూష, బాలాజీ, రియాజ్‌బాషా, నాగబాబు, జయప్రకాష్, పార్వతి, సునీత, ఆడిట్ కన్వీనర్‌గా పీఎన్‌డీ ప్రసాద్ నియమితులయ్యారు. ఎన్నికల అధికారి సీతారామయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ నరేంద్ర, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ 116వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంకోసం పోరాడుతూ ప్రాణ బలిదానం చేసిన మహాయోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. దేశ సంక్షేమం కోసం యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, సభ్యులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, పి.సత్యనారాయణ, కె.రామకృష్ణ, జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కురుమద్దాలి(పామర్రు): గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కాటే కోటేశ్వరరావు భార్య రమణ (49) బుధవారం రాత్రి మృతి చెందారు. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మరణించింది. ఈ నేపథ్యంలో పామర్రు శాసనసభ్యులు కై లే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సర్పంచ్ జి.విజయభారతి ఆ కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జి, ఫకీరు, రాంప్రసాద్, సుబ్బారావు, శ్రీనివాసరావు, రాజు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికలు

పమిడిముక్కల: జెడ్పీ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్, నేషనల్ హాకీ ప్లేయర్ తిరుమణి మురళి ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల నుంచి అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలను రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేస్తామని వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమ్మడి నారాయణ తెలిపారు.

అమ్మమ్మ చెంతకు బాలుడు



ముదినేపల్లి రూరల్: అదృశ్యమైన హాస్టల్ విద్యార్థి ఎట్టకేలకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రైల్వే స్టేషన్‌లో గురువారం కనిపించాడు. కై కలూరు సర్కిల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్సై వెంకటకుమార్‌లు ముదినేపల్లి పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ ఈ నెల 15న వినాయక చవితి పండుగ సందర్భంగా ముదినేపల్లి బీసీ హాస్టల్ నుంచి బోయిన హరికృష్ణ (7వ తరగతి విద్యార్థి) మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామానికి వెళ్లాడు. హరికృష్ణ అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటున్నాడు. అప్పటి నుంచి కనిపించడం లేదు. కేసు నమోదు చేసి పోలీసులు గాలిస్తున్నారు. సీఐ చొరవతో రైల్వే పోలీసులు సమాచారం ఇవ్వగా హరికృష్ణను అమ్మమ్మ, తాతయ్యలకు అప్పగించారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, కుటుంబ సభ్యులు

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) కుటుంబ సభ్యులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ విఘ్నేశ్వర స్వామి కరుణా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని గత 14 సంవత్సరాలుగా ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని శరత్ థియేటర్ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 8 వేల మంది పైబడి భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. స్వామి వారి నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కోయవేషాలు, డప్పులు, కోలాటం, విచిత్ర వేషధారణ, తీన్మార్ డప్పుల సందడిలో ఈ నిమజ్జన కార్యక్రమం జరిగింది. స్వామివారి విగ్రహం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బయలుదేరి మార్కెట్ సెంటర్, శ్రీరామ్‌పురం మీదుగా రాజేంద్రనగర్ లోని ఎమ్మెల్యే కొడాలి నాని ఇంటికి చేరుకుని అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం తిరిగి ఏలూరు రోడ్, మెయిన్ రోడ్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ మీదుగా పామర్రు రోడ్‌లోని పెద్ద కాల్వలో స్వామి వారిని నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవాలు

పామర్రు: గణపతి నవరాత్రులు పూర్తయిన సందర్భంగా పలు చోట్ల గురువారం గణనాథులను ఊరేగించి నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. జమీదగ్గుమిల్లిలోని వినాయక మందిరంలోని స్వామికి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించి అనంతరం స్వామిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తొలుత స్వామిని గజమాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మేళ తాళాలతో కనక తప్పెట్లతో, డప్పు వాయిద్యాలతో డిజె సౌండ్ సిస్టమ్స్‌లతో, రక రకాల విద్యుద్దీపాలతో స్వామివారికి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల వెంబడి ఊరేగింపు చేశారు. అనంతరం స్వామిని శ్రీకాకుళంలోని కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. రాపర్ల గ్రామంలోని వినాయక స్వామిని వైభంగా గ్రామోత్సవం చేసి అనంతరం స్థానిక కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని పలు చోట్ల వినాయక స్వామిలను ఊరేగించి అనంతరం స్వామిని నిమజ్జనం చేశారు.

కోదండరామాలయంలో అన్నసమారాధన

మండవల్లి: వినాయక చవితి నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని మండవల్లి స్టేషన్ రోడ్డులోని కోదండరామాలయంలో గురువారం రాత్రి అన్నసమారాధన నిర్వహించారు. మండవల్లి, అయ్యవారి రుద్రవరం, అప్పాపురం, పెరికెగూడెం, గన్నవరం తదితర గ్రామాల నుంచి సుమారు 2,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నసమారాధన ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నిమజ్జనంలో భాగంగా భారీ ఊరేగింపు



జమీదగ్గుమిల్లి గ్రామంలో ఊరేగుతున్న వినాయక స్వామి

ప్రజల్లో భక్తి భావన పెంపొందించాలి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో భక్తి భావనను పెంపొందించాలని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. తాడంకి రెడ్డిపాలెంలో అన్న సంతర్పణ సందర్భంగా గణనాథుడిని ఎమ్మెల్యే గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకొన్నట్లు తెలిపారు. గణేష్ కమిటీ వారు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను సత్కరించారు. భక్తులకు భారీ అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, జిల్లా రెడ్డిక సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దారపు రమాదేవి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు తెనాలి పద్మావతి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి, స్థానిక నాయకులు కొల్లి రాము, బోయి అసిరయ్య, చల్లా శ్రీను, కూచిపూడి వీరాస్వామి, కూచిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తాడంకి రెడ్డిపాలెంలో స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వృత్తి విద్యలతో మహిళలకు స్వయం ఉపాధి



మాట్లాడుతున్న పూర్వ గవర్నర్ లయన్ దామర్ల శ్రీశాంతి

పామర్రు: మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరితే ఆయా కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయని లయన్స్ జిల్లా 316డి పూర్వ గవర్నర్ లయన్ దామర్ల శ్రీశాంతి అన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరం మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమం గురువారం స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీశాంతి పాల్గొని మాట్లాడుతూ మహిళలు వృత్తి విద్యలైన కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడర్, బ్యూటీషియన్ కోర్సులు, కంప్యూటర్ శిక్షణ పొందాలని చెప్పారు. అప్పుడే వారు ధైర్యంతో బతుకుతూ కుటుంబ పోషణకు మార్గం ఏర్పాటవుతుందని తెలిపారు. గౌరవ అతిథిగా మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ మూల్పూరి ఉపేంద్ర మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉంటేనే ఇటు సమాజం అటు సంసారం సుభిక్షంగా ఉంటుందన్నారు. క్లబ్ సభ్యులు సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన 162 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్‌లను ఉచితంగా అందజేశారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా నేతలు బీవీ అప్పారావు, కె.చంద్రశేఖర్‌రావు, పామర్రు యూనియన్ బ్యాంక్ మేనేజర్ జి.శేషగిరిరావు, సబ్ మేనేజర్ వసుధ బసవేశ్వరరావు, లయన్స్ రీజియన్ నేతలు తోట రమేష్, లంకపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం. మధుసూదనరావు, శిక్షకురాలు సుగ్గన జ్యోతి పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

కైకలూరు: వీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీం) యూనిట్, ఫిజిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యాన కైకలూరు ఎస్టీ కాలనీలో 150 మంది పేదలకు భోజన ప్యాకెట్లను గురువారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ కార్యక్రమాల్లో భాగంగా భోజనం ప్యాకెట్లు అందించామన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ పి.పాల్‌దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.విజయకుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త ఆర్.జలబాబును అభినందించారు.



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రఘునాథరెడ్డి

పాల కేంద్రం సమస్య పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: జమీగొల్వేపల్లి గ్రామంలోని పాల సేకరణ కేంద్రం సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే నివాస గృహానికి గ్రామస్తులు వారి సమస్యను తెలుపుకునేందుకు గురువారం వచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని టీడీపీ నేత పాల కేంద్రం అధ్యక్షులైన వల్లభనేని రాజేంద్రబాబు పదవీ కాలం జనవరి నెలతోనే పూర్తయిందన్నారు. అయినా ఆయన తన పదవిని వదిలిపెట్టకుండా అంటి పెట్టుకుని ఉంటున్నాడని పేర్కొన్నారు. పాల ఉత్పత్తి దారులకు పూర్తి స్థాయి వెన్నశాతం వేయకుండా ఆర్థికంగా నష్టం కల్గిస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ఈ విషయమై పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ పాల కేంద్రానికి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. వచ్చే వారంలో ఈ పనిని పూర్తి చేసి గ్రామస్తుల ఇబ్బందులను తొలగిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు వల్లభనేని బుల్లిబాబు, మద్దాలి వెంకటేశ్వరరావు, పొట్లూరి కృష్ణారావు, కొల్లి గోపాల కృష్ణ, సామియేలు, బసవయ్య, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రూప్ సాంగ్ పోటీలు



గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నేషనల్ గ్రూప్ సాంగ్స్ పోటీలు నిర్వహించారు. హిందీ, సంస్కృతం, తెలుగు భాషల్లో ఫోక్ సాంగ్స్ పోటీలు జరిగాయి. మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ మొదటి స్థానం, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రెండవ స్థానం కై వసం చేసుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రాంతీయ అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్, కార్యవర్గ సభ్యులు కొమ్ము వెంకటేశ్వర్లు, బొగ్గారపు తిరుపతయ్య, శాఖా కార్యదర్శి నల్లూరి శేషగిరిరావు, ప్రత్యేక ఆహ్వానితులు ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, సభ్యులు తిరుమలశెట్టి హారిక, రామకృష్ణ (ఆర్‌కె), తదితరులు పాల్గొన్నారు.

యెర్నేని నాగేంద్రనాథ్ మృతి తీరని లోటు

కై కలూరు: రాష్ట్ర రైతు సమాఖ్య అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్ మృతి తీరని లోటని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కొండూరులో నాగేంద్రనాథ్ మృతదేహానికి గురువారం నివాళులర్పించారు. అనంతరం యెర్నేని సతీమణి, మాజీ మంత్రి సీతాదేవి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, బొర్రా ఏసుబాబు, బుల్లయ్య, తొండూరి రమేష్, కాళ్లపాలెం బుజ్జి, చార్లెస్, పండు, రాజేష్ తదితరులు ఉన్నారు.



యెర్నేని సతీమణి సీతాదేవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

జిల్లా స్థాయి పోటీలకు బాలికల ఎంపిక

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో గురువారం ఏడు మండలాల స్థాయిలో అండర్-14, అండర్-17 బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక ఆటల పోటీలు నిర్వహించారు. 160 మంది పాల్గొనగా ప్రతిభ చూపిన 48 మంది విద్యార్థినులు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎం బి.శివరామప్రసాద్ తెలిపారు.

స్వామి వారి లడ్డూ ప్రసాదానికి వేలం

గుడివాడ టౌన్: మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించిన లడ్డూ ప్రసాదాలను గురువారం పాలక వర్గ సభ్యుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వల్లూరుపల్లి సుధాకర్, కొల్లి విజయ్‌లు 21 కిలోల లడ్డూను రూ.54 వేలకు వేలంలో దక్కించుకున్నారు. భక్తులు సమర్పించిన మరో రెండు ప్రసాదం లడ్డూలను పెద్ది కిషోర్ రూ.10 వేలు, మోటేపల్లి రాంబాబు రూ.7,900 దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు శేషగిరిరావు(గిరిబాబాయ్), చుండూరి శేఖర్, జోగా నాగేశ్వరరావు, కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్, పెద్ది కిషోర్, జ్యోతుల మణికంఠ, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



లడ్డూను స్వీకరిస్తున్న వల్లూరిపల్లి సుధాకర్

సామాజిక విప్లవ కవి గుర్రం జాషువా



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ తదితరులు



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: తన కవితలతో సమాజంలో మార్పులకు నాంది పలికిన మహానుభావుడు గుర్రం జాషువా అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గుర్రం జాషువా సామాజిక విప్లవ కవి అన్నారు. ఆయన రచించిన కవితలు ఎన్నో ఇప్పటికి సజీవంగా సమాజంలో ఉన్నాయని చెప్పారు.

పెదపారుపూడి: మండల పరిషత్ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వి. శ్రీనివాసరావు కార్యాలయ సూపరింటెండెంట్ రమణారావు పాల్గొన్నారు. జాషువా చిత్రపటానికి తహసీల్దార్ వి. నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు చాట్ల అజయ్‌కుమార్, ఆనందరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: గుర్రం జాషువా జయంతి గురువారం స్థానిక శివరామ థియేటర్ కాంప్లెక్సులో జంపుల కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్‌బాబూ జగ్జీవన్‌రామ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చిగళ్ల దేవానందరావు పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధికి జాషువా చేసిన సేవలు ఎంతో ఆదర్శవంతమైనవని చెప్పారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక చాట్లవానిపురంలోని బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ మేనేజర్ ఆర్‌బీఆర్ ప్రసాద్, నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు, జువ్వనపూడి సురేంద్ర, మొవ్వ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చీకటిమర్ల శివరామ ప్రసాద్, సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు నందిపు నాంచారయ్య పాల్గొన్నారు.

అన్ని వసతులతో టిడ్కో ఇళ్లు



తాళాలు అందజేస్తున్న కమిషనర్ తదితరులు

గుడివాడ టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆశయ సాధనలో భాగంగా ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేరుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. కైకాల సత్యన్నారాయణ కళామందిరంలో గురువారం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వసతులతో ఏర్పాటు చేసిన టిడ్కో గృహాలు నివాసానికి ఎంతో యోగ్యంగా ఉన్నాయన్నారు. పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నేడు 472 మంది లబ్ధిదారులకు తాళాలు అందజేశామని చెప్పారు. కుటుంబాలు పెరిగిన వెంటనే అక్కడ ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. బస్ షెల్టర్, షాపింగ్ కాంప్లెక్స్, రైతు బజారు వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు వీరిశెట్టి నరసింహారావు, చింతల భాస్కరరావు, అల్లం సూర్యప్రభ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు అల్లం రామ్మోహన్, నయనవరపు శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్చక సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఫణిగోపాల్

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో గుడి గుడికి అర్చక సమాఖ్య పేరిట డివిజన్ సదస్సు బంటుమిల్లి రోడ్‌లోని ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య కృష్ణా జిల్లా అధ్యక్షుడు అగ్నిహోత్రం ఫణిగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్చకుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అయినప్పటికీ ప్రతి గుడిలోనూ అర్చకులకు ఏదో ఒక ఇతర సమస్య ఎదురవుతూ వస్తుందన్నారు. వీటన్నింటిని సమీక్షించి వాటి పరిష్కారం కోసం సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉన్నామన్నారు. ఇప్పటికే ఒక నివేదిక దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ముందు ఉంచామన్నారు. గుడివాడ డివిజన్ అధ్యక్షుడు యడవల్లి విజయభాస్కర్, కార్యదర్శి భరతుల వెంకట రమణమూర్తి, సమాఖ్య నాయకులు మామిళ్ల రాంబాబు, యడవల్లి పాండు రంగారావు, వేదాంతం అప్పలాచార్యులు, లంకా చందు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



గీటు రాయి సంచికను తహసీల్దార్ భరత్‌రెడ్డికి అందిస్తున్న జమాత్ ఇస్లామి సభ్యులు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గుడివాడ టౌన్: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్తను స్తుతిస్తూ ముస్లింలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సర్వప్రాణకోటి సంరక్షణ కోసం మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు జరుపుకుంటున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా స్థానిక మియాఖాన్ (పెద్ద మజీదు) కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పట్టణ పురవీధుల్లో మహ్మద్ ప్రవక్తకు జై చెబుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ వలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ భాజీ, మత గురువులు, మియాఖాన్, జమాత్ మజీదుల కమిటీ సభ్యులు కరీముల్లా, షాహిద్, సాలేహా పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

పామర్రు: మహా ప్రవక్త ముహమ్మద్ సల్లాలాహు అలైహి వస్సలం పుట్టిన రోజును మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటామని జమాత్ ఇస్లామి హింద్ పామర్రుశాఖ సభ్యులు గురువారం తెలిపారు. ప్రవక్త జీవిత విషయాలను తెలియజేసే 'గీటు రాయి' ప్రత్యేక సంచికను విడుదల చేశామని పేర్కొన్నారు. దీనిని గ్రామంలోని ప్రముఖులకు అధికారులకు, డాక్టర్లకు అందించామని చెప్పారు. దైవ గ్రంథం ఖురాన్ సమస్త మానవాళి కోసం ఉద్భవించిందన్నారు. దానికి ప్రతిరూపమే ముహమ్మద్ ప్రవక్త జీవితమని అన్నారు. ఆయన జీవితాన్ని ఆచరణ విధానాలు మనం పాటిస్తే ప్రాపంచిక జీవితం, పరలోక జీవితం రెండు సఫలం అవుతాయన్నారు. అనంతరం మిలాద్ నబీ వేడుకలు నిర్వహించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జమాత్ ఇస్లామ్ హింద్ అధ్యక్షుడు మూనుస్ ఉమ్రి, మత గురువ అబ్దుల్లా ఉమ్ర, కార్యకర్తలు షరీఫ్, కరిముల్లా, ఇబ్రహీం, రెహ్మాన్ పాల్గొన్నారు.